# పెద్దలకు మాత్రమే

ఇచ్ఛాపురపు రామచంద్రం

చాలా కాలంనుంచీ నన్నొక సందేహం పట్టి పీడిస్తూంది. అదేమిటంటే మనిషి ఎప్పుడు - ఎన్నేళ్ళకి పెద్దవాడౌతాడా అని. సందేహ నివృత్తి కోసం ఎందరినో అడుగుతూ వొచ్చాను.

"నలభై దాటితే మగవాడు పెద్దవాడైపోయినట్లే లెక్క. ఎందుకంటే" అప్పటికతనికి మనసులో శృంగారమూ, వొంట్లో ఓపికా సూలన పడిపోతాయి." అన్నాడు జీవితానికి శృంగారమే కొలబద్దగా చేసుకున్న ఓ పెద్దమనిషి. "నలభైలో పునర్ యౌవనం ఆవిర్భవిస్తుందంటారు కదా" అంటూ నేనతని మాటలను ఖండించలేదు. ఎందుకంటే- నాకు కావలసింది విషయం కాని వాదన ఎంత మాత్రమూ కాదు.

మరొక పెద్దవారి నడిగాను నా మనసులోని సంశయం.

"చిక్కు ప్రశ్నేనోయ్. రహస్యం చెప్పేసేదా !" అన్నాడాయన కొంటెగా చిరునవ్వు నవ్వుతూ.

"సెలవివ్వండి దయచేసి" అన్నాను వినయంగా.

"ఏమనిషీ - తన దృష్టిలో తానెన్నటికీ పెద్దవాడు కాడు పెద్దవాడు కావడమనేది- మనిషికి- తప్పు చేసినట్లో, శిక్ష అనుభవించడంలాగో అనిపిస్తుంది. అందుకు" అన్నాడాయన గంభీర వదనంతో.

వారి మాటలలో నిజం లేకపోలేదనిపించింది కాని.... పెద్దల మాటను ధిక్కరించటం కాదుకానీ.. ఆయన వ్రాకుచ్చిన దానిలో అబద్ధమూ లేకపోలేదేమో అనిపించింది.

పట్టువదలని విక్రమార్కుడిలా నేను నా ప్రశ్నకు నాకు నచ్చే జవాబు కోసం ప్రయత్నించడం మాత్రం మానలేదు.

"భార్య ఉండగా భర్త పెద్దవాడు కాడోయ్. ఎందుకంటే సరస శృంగార వేళల ఆమె అతన్ని- 'మీకేం, బాలాకుమారులు' అంటూ ఉంటుంది అతనికి పళ్ళూడిపోయినా, తల పండిపోయినా." అని వొకరంటే;

"షష్టిపూర్తిని వృద్ధాప్యానికి— అదే - పెద్దరికానికి ప్రారంభంగా భావించ వొచ్చునోయ్" అన్నారు మరొకరు.

కొందరరవై అంటే- మరి కొందరు ఏభై ఎనిమదన్నారు. ఏభై ఐదన్న వారూ ఉన్నారు. వీళ్ళందరూ - ప్రభుత్వం నిర్ణయించిన పదవీ విరమణ వయస్సుని పెద్దరికంగా భావించి చెప్పినవారు. నాకు సంతృప్తి కలగలేదు.

నామట్టుకు నాకు- నేను కిందటి సంవత్సరం చిన్నవాడిననిపిస్తుంది. పుట్టిన రోజున మా ఆవిడ తలంటుపోస్తూ నా వయసు గుర్తుచేస్తూంటే. నాకు నలభై ఐదు



వొస్తే- నలభై నాలుగు చిన్న వయసనిపించింది. ఏభై రెండు వొస్తే- ఏభై వొకటి చిన్న వయసనిపించింది. అందుకే- నేను- నిండిన సంవత్సరాలనే తప్పు వొచ్చిన యేళ్ళను చెప్పను. ఇది బలహీనత అనీ ఆత్మ వంచననీ నాకూ తెలుసు. కానీ యీ విషయంలో నన్ను నేను జయించుకోలేక పోయాననే వొప్పుకోవాలి.

పుర్రెకు పుట్టిన బుద్ధిలాగే మనసుకి పట్టిన సందేహమూ, తీరే వరకూ వొదలదు కదా.

పుస్తకాలను.... పెద్దలను.... పిన్నలను.... ఎందరినో అర్థించాను నా ప్రశ్నకు బదులేదని.

పుస్తకాలూ, వారూ జవాబు చెప్పలేదని కాదు: చెప్పాయి. చెప్పారు. కాని ఆ జవాబులలో ఏ ఒక్కటి నాకు నచ్చలేదు. అదీబాధ. మానవ బలహీనతే అది మరి. జవాబు దొరికితే చాలదు. అది మన మనసుకి నచ్చాలి. అంత వరకూ అన్వేషణే. తప్పదు.

*　　　*　　　*

ఆడవాళ్ళకి పుట్టినిల్లు మెట్టినిల్లు లాగే మగవాడికి రెండిళ్ళుండవచ్చు మొదటిది జన్మభూమి(పుట్టినవూరు).రెండవది జాబు భూమి(ఉద్యోగం చేసేవూరు). బదిలీ మూలంగా నా ఉద్యోగం వూరు మారింది. కొత్తవూరు చాలా విధాల పాత వూరిలాగే ఉన్నా యీ వూరికొక ప్రత్యేకత వుంది. అదేమిటంటే- క్లబ్బు. ఈ క్లబ్బులో ప్రత్యేకమయిన ప్రత్యేకత ఉంది. ఒక వంక పేకాట.... మరో వంక టేబుల్ టెన్నిస్ .... ఓ గదిలో క్యారమ్స్.... అపక్కన చదరంగం....


ఎవరికేం కావాలంటే అది.... ఏ వినోదానికావినోదానికి ఇతరులతో సంబంధం లేకుండా కేటాయింపుగా గదులు. ఆరుబయట - దూరంగా టెన్నిస్ కోర్టు. ఇవతలగా- న్యూస్ పేపర్లు. చిన్న గచ్చు వేదిక. పెద్దవాళ్లు ఆ గచ్చు వేదిక వద్ద కుర్చీలు వేయించుకుని.... వేదిక మీదకు కాళ్ళు జాచి .... పేపరు పఠనమూ.... కబుర్లూ . ఇక్కడంతా ఏభై దాటినవారే. ఇదో గ్రూపు. నేనూ దీనిలోనే చేరాను మొదటి రోజే.—

ఆయన నన్నాకర్షించేడు. ఆయనపేరు మాధవరావ్‌ట. నిమ్మపండు రంగు. పొట్టీ పొడవు కాని విగ్రహం. తిల తండులాలు కలబోసినట్లు పండీ పండని జుత్తు. ముఖ్యంగా ఆయన మాటలు. ఎంతో సరదాగా, ఉత్సాహంగా.... క్షణం విరామం యివ్వకుండా... అందరినీ ఆకట్టుకుంటూ.... నవ్విస్తూ.... నవ్వేస్తూ.... యీ వృద్ధులమధ్య....కొంగలలో హంసలాగ ప్రత్యేకంగా గోచరించాడు నా కంటికి....

మెల్లగా పరిచయం సంపాదించాను. స్నేహం పెంచాను.ఆయన ప్రవర్తనలో ఏమీ మార్పులేదు. సాయంత్రమయ్యేసరికి క్లబ్బుకి రావడం... ఉత్సాహంగా ఉల్లాసంగా కబుర్లు చెప్పటం....నవ్వులు కురిపించడం.... చీకటి పడేసరికి మేమంతా యిళ్ళకి వెళ్ళిపోగా తానేమో ఓగంట పేకాటాడుకుని యింటి ముఖం పట్టడం.

స్నేహం కొంచెం ముదిరాక అడిగాను. "మీరు యింత ఉత్సాహంగా కుర్రాళ్ళకంటె కుర్రాడిగా ఉంటారే.... మరి - యీ ముసలివాళ్ళ మధ్య కెందుకు వొస్తారు ?"

ఆయన- నవ్వేశాడు.... "నిజమే. నేను చిన్నవాణ్ణే. కాని...." ఏదో చెప్పబోయి అంతలోనే మానేసుకున్నట్లు ఆగి — "అదంతేలే..." అని తేల్చి వొదిలేశారు.




నేను మాత్రం వొదిలెయ్యలేదు.


ఎందుకో— నా ప్రశ్న కీయనవద్దే జవాబు దొరకవచ్చునని నా అంతరాత్మ మరీమరీ చెప్పింది.


నిరీక్షిస్తున్నాను.

నెలలు గడిచాయి.... కార్యక్రమంలో ....క్లబ్బులో సాయంత్రాలలో ఏమీ మార్పు లేకుండానే.

హటాత్తుగా... ఆ సాయంకాలం.... మా గచ్చువేదిక బోసిపోయింది. నా మిత్రులు మాధవరావుగారు- రాలేదు.

ఆవేళేకాదు... మరో పన్నెండు రోజులవరకూ ఆయన క్లబ్బుకి రాలేదు మేమంతా.... ఎవరికివాళ్ళం.... మన్నుతిన్న పాముల్లా... నిరుత్సాహంగా...




నిశ్చైతన్యంగా.... స్తబ్దుగా.... గడిపాం. మాధవరావ్‌గారు లేరు. మా గ్రూప్‌కి జీవకళా లేదు.

ఏమయిందాయనకి ?

ఎందుకు రాలేదు ?

ఎవరికి తెలియదు. ఆయనది- రెండుమైళ్ళ దూరంలోని పల్లెటూరు. వెళ్ళి కనుక్కునేవారు లేకపోయారు. అందుచేత ఆయన కబుర్లు తెలియలేదు.

ఇవేళకూడ చూసి.... ఆయన రాకపోతే- రేపాదివారమే కనుక నేనే వారి వూరు వెళదామని నిశ్చయించుకున్నాను, క్లబ్బులో అడుగుపెడుతూ.

ఇంకా ఎవరు రాలేదు. కుర్చీ వేయించుకుని ఒంటరిగా కూర్చుని.... క్లబ్బు గేటువేపు చూస్తున్నాను. ఇవాళేనా- మాధవరావుగారు- ఎప్పటిలా- తెల్ల లాల్చీ వేసుకుని.... గ్లాస్కోపంచె కట్టుకుని.... యువకుడిలా.... చకచక.... చరచర.... చెప్పులు చప్పుడు చేసుకుంటూ.... నవ్వుతూ.... వొచ్చి పలకరిస్తారేమో అని ఆశ. పలకరించాలన్న కోరిక.

ఐదు నిమిషాలు గడిచాయేమో.

గేటుముందు రిక్షా ఆగింది. ఆశ్చర్యపోయాను. సాధారణంగా మా క్లబ్బు ముందర రిక్షాలాగవు. ఆగినా- దానిలోంచి దిగినవారు మావేపు రారు. పేకాట గది వేపు పోతారు.

ఎవరో వృద్ధుడు.

తలంతా ముగ్గుబుట్ట. చర్మమంతా ముడతలుపడి.... నడుమువొంగి... నడవలేక నడవలేక నడుస్తూ.... కర్ర పట్టుకుని...

ఎవరీయన ?

ఇంత పండు ముసిలికి క్లబ్బులో ఏంపని? ఏ మనవడికోసమో, కొడుకు కోసమో వస్తున్నారేమో.

ఆయనకి నడక శ్రమ తగ్గించి.... కావలసినమాట చెబుదామని.... ఎదురు వెళ్ళాను.

తలవొంచుకుని.... నేలమీదేచూస్తూ.... నడుస్తున్నారు ఆయన. శరీరం- నల్లగా.... కమిలిపోయి.... ముడతలుపడి ఉంది.

"ఎవరుకావాలి తాతగారు ? ఏం కావాలి ?" అడిగాను.

ఆయన.... ఒక్కసారి.... శక్తిని కూడగట్టుకుని.... తలెత్తి.... కళ్ళద్దాలు పడిపోకుండా సవరించుకుని వొణుకుతున్న గొంతుతో.... బాధగా.... పెన్నిధి కోల్పోయిన పేదకంటె దీనంగా.... మెల్లగా అన్నారు- కళ్ళల్లో నీళ్ళతో "నేనోయ్ మాధవరావుని"

నివ్వెరపోయాను.

నేను చూస్తున్నద.... వింటున్నది.... నిజమేనా అనిపించింది. నమ్మలేక పోతున్నాను. ఒక మనిషిలో.... మాధవరావుగారివంటి మనిషిలో.... కేవలం పదిహేను రోజులలో- యింత మార్పు.... మనిషినే గుర్తుపట్టనివ్వనంత మార్పు- సాధ్యమేనా ? సంభవమేనా ?

అయితే... యింతమార్పుకి- కారణమేమై ఉండాలి ?

"జబ్బు చేసిందా ? మీ గురించి ఏమీ తెలియలేదిన్నాళ్లూ...." ఆర్ద్ర హృదయంతో పరామర్శించి- ఆయనకు ఆసరాగా చేయి అందించాను.

"జబ్బు కాదోయ్. నాకు జబ్బేమిటి? అంతకంటే భయంకరమైనదే. విపత్కరమైనదే...." ఆయన కంఠం వొణికిపోతూంది.

తీసుకువెళ్ళి.... కుర్చీలో కూర్చోబెట్టి.... మంచినీళ్ళందించి.... అప్పుడడి గాను మెల్లగా. ఏం "జరిగిందండీ అసలు ? "

ఆయనొకసారి ఆకాశంవేపు చూశారు.

"నేను పెద్దవాడినై పోయానోయ్.... అంటే.... అదే నేను.... కావాలని కాలేదు.... మా అమ్మ నన్ను హటాత్తుగా పెద్దవాణ్ని చేసేసింది."

నాకేమీ అర్థం కాలేదు వారి మాటలు. అది గ్రహించినట్టే అన్నారు వారు. "ఎప్పుడో అడిగావు కదూ, మనిషినిజంగా ఎప్పుడు పెద్దవాడౌతాడని ! ...."

"....ఊఁ...."

"అమ్మ చనిపోతే ఔతాడోయ్. మా అమ్మ చనిపోయింది. ఆక్షణం నుంచే నేను పెద్దవాడినయ్యాను.... చూస్తున్నావుగా...."

అవాక్కయి పోయాను.

ఆయనను చూస్తూంటే ఆయన నిగ్గు తేల్చిన నిజాన్ని తన మీదే సోదాహరణగా నిరూపిస్తూంటే— ఇంకేమనగలను ?

నిజమే అనిపించింది.

మనిషి— వయసు వల్ల పెద్దవాడు కాడు. అమ్మ ఉన్నంత కాలం ఆ అదృష్టవంతుడు చిన్నవాడే ఎంత వయసు వచ్చినా వొంటి మీదకి !